క్లుప్తంగా

మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు: క్రోసూరు లోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్స్‌పల్ పి.శౌరీరాజు శనివారం తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు వివరాలు తెలుపుతూ 5 వతరగతి ప్రమోషన్ అర్హత ఉండాలి, ఓబీసీ విద్యార్థులైతే 1-9-2011 నుండి 31-8-2013 మధ్యపుట్టి ఉండాలి, ఎస్సీ,ఎస్టీ అయితే 1-9-2009 నుంచి 31-8-2013 మధ్య పుట్టినవారై ఉండాలన్నారు. ప్రవేశ పరీక్షా పత్రం ఆబ్‌జెక్టివ్ టైప్ లోపరీక్ష ఉంటుందన్నారు. ఓసీ,బీసీ విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు సాధించాలన్నారు. ఓసీ,బీసీ రూ.150, ఎస్సీ,ఎస్టీ రూ.75 రుసుము ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు. జూన్‌నెల 11 వ తేదీన క్రోసూరు మోడల్‌స్కూల్ నందు ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుండి ఉంటుందన్నారు. ఈనెల 26 వ తేదీ దరఖాస్తు స్వీకరణకు ఆఖరుతేదీ, రుసుము చెల్లించే తేదీ ఈనెల 25 తేదీ అఖరుగా తెలిపారు. వివరాలకు మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు సెల్ నంబర్లు : 8688851618, 7416611618 ను సంప్రదించవచ్చునన్నారు.

108 వాహనంలో సుఖప్రసవం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన త్రివేణి రెండవ కాన్పు కోసం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు వెళ్లేందుకు శనివారం 108 వాహనంలో బయలుదేరింది. మార్గం మధ్యలో సత్తెనపల్లి మండలం దూళిపాళ్ళ గ్రామం వద్దకు రాగానే త్రివేణికి నొప్పులు అధికమయ్యాయి. తట్టుకోలేని పరిస్థితి ఉండడంతో 108 వాహనంలోనే ప్రసవించింది. ఈఎన్‌టి గోపి, పైలెట్ బ్రహ్మనాయుడు పుట్టిన ఆడబిడ్డకు ఆక్సిజన్ అందకపోవడంతో సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలు నిలబెట్టారు. బిడ్డ బరువు 3.5 కేజీలు ఉన్నట్లు తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

108 వాహనంలో మహిళ ప్రసవం

బెల్లంకొండ: పురిటి నొప్పులతో బాధపడుతూ వైద్యశాలకు వెళ్తున్న గర్భిణీకి నొప్పులు తీవ్రమవడంతో 108 వాహనంలోనే సిబ్బంది ప్రసవం చేసి తల్లిబిడ్డల ప్రాణాలను కాపాడారు. పుట్టిన బిడ్డలో చలనం లేకపోవడంతో దాదాపుగా 20 నిమిషాల పాటు శ్రమించి, సీపీఆర్ చేసి 108 సిబ్బంది బిడ్డకు ఊపిరి పోశారు. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన త్రివేణి అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు ఫోన్ చేశారు. ఈ క్రమంలో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్తున్న క్రమంలో ధూళిపాళ్ల సమీపంలో త్రివేణికి నొప్పులు తీవ్రమవడంతో 108 వాహనంలోనే ప్రసవం చేశారు.

అర్హులైన వారందరికీ పథకాలు అందజేయాలి

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాల్ని అర్హులైన వారందరికీ అందజేయాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీవో మాధ్యూబాబు, తహసీల్దార్ అంకారావు, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 42మందికి ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో టెక్ మహేంద్ర సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 42మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. టెక్ మహేంద్ర సంస్థ హెచ్ఆర్ ఆర్.విశాలాక్షి ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ రౌండ్స్ నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు ఆయన వివరించారు. ఎంపికైన విద్యార్థులు తృతీయ సంవత్సరం డిగ్రీ పూర్తి చేసిన అనంతరం విధుల్లో చేరాలని, రూ.2.75 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. విద్యార్థుల్ని కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.సురేష్‌బాబు, ఆంగ్ల భాషా శిక్షకుడు ఎం.విశ్వేశ్వరరావు అభినందించారు.

సోలార్ పంపు సెట్ల వైర్ల చోరీ

నాదెండ్ల: గణపవరం పంట పొలాల్లో సోలార్ పంపు సెట్ల విద్యుత్ వైర్ల చోరీ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొర్నెగంటి మస్తాన్‌రావుకు కావూరు డొంక రోడ్డులో ఎకరం పొలం ఉంది. అందులో ప్రభుత్వ సబ్సిడీపై సోలార్ పంపుసెట్టును ఏర్పాటు చేసుకుని తైవాన్ జామ సాగు చేసుకుంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి మోటార్ నుంచి స్టార్టర్‌కు వెళ్లే బాక్స్ కేబుల్ వైరు, ప్యానెల్ సెట్ల మధ్య కాపర్ వైరును దుండగులు కత్తిరించుకెళ్లారు. గతంలో కూడా నాలుగు పర్యాయాలు చోరీ జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు. వైర్ల చోరీతో నిందితులకు వచ్చేది కొద్దిమొత్తమైనా, రైతులకు మాత్రం తీవ్ర నష్టం వాటిల్లుతోందని వాపోయాడు.

పది పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులు

బెల్లంకొండ: పదో తరగతి పరీక్షల్లో మండల వ్యాప్తంగా 72.14 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యశాకాధికారి బి.మల్లిఖార్జున శర్మ తెలిపారు. మండల వ్యాప్తంగా అన్నీ పాఠశాలలో 219 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 158 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. పాపాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తమ్మిశెట్టి బాలు ఉత్తమ మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించాడు. బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన వజ్రాల కళ్యాణ్‌రెడ్డి ఉత్తమ మార్కులతో ద్వితీయ స్థానం నిలిచాడు. అదే పాఠశాలకు చెందిన ఎస్కే సమీరా ఉత్తమ మార్కులు సాధించింది. బెల్లంకొండ జెడ్పీ పాఠశాలలో 81 మందికి గానూ 59 మంది, పాపాయపాలెం జెడ్పీ పాఠశాలలో 57కి గానూ 41 మంది, చంద్రాజుపాలెం జెడ్పీ పాఠశాలలో 30 మందికి గానూ 29 మంది, బెల్లంకొండ క్రాస్‌రోడ్డులో గల కస్తూర్బా పాఠశాలలో 32 మందికి గానూ 29, గిరిజన బాలుర పాఠశాలలో 19 మందికి గానూ 11 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

క్రోసూరు మండలంలో 80 శాతం ఉత్తీర్ణత

క్రోసూరు: పదో తరగతి పరీక్ష ఫలితాలు శనివారం విడుదల కావడంతో మండలంలోని పదవతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ జి.ఏసురత్నం తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 885 మంది పరీక్షలు రాయగా వారిలో 712 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 173 మంది ఫెయిల్ అయినట్లు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలు 10, ప్రైవేటు పాఠశాలలు 4 పాఠశాలలు కలిపి 14 పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలు రాశారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలు తెలుపుతూ ఇంగ్లిషుమీడియంలో 88 త్యాళ్లూరు జెడ్పీపాఠశాల విద్యార్థి కె.ప్రజ్వల్ కుమార్ ప్రథమస్థానం సాధించగా, ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థిని లక్ష్మీ రత్నమాణిక్యం ద్వితీయ స్థానం సాధించింది. దొడ్లేరు పాఠశాల విద్యార్థి ఏ.తిరుపతిస్వామి మూడవ స్థానం సాధించాడు. అదేవిధంగా తెలుగుమీడియంలో క్రోసూరు జెడ్పీపాఠశాల విద్యార్థిని మాతంగి నందిని, ఊటుకూరు విద్యార్థిని మాతంగి నందిని ఇద్దరు విద్యార్థులకు ఉత్తమ మార్కులు వచ్చినట్లు ఎంఈఓ చెప్పారు. బయ్యవరం జెడ్పీపాఠశాల విద్యార్థి బోరు గడ్డసాహితికి ఉత్తమ మార్కులు రాగా, జెడ్పీపాఠశాల నాగవరం ,ఎం.విజయకుమార్ కు ఉత్తమ మార్కులు వచ్చినట్లు తెలిపారు.

మండలంలో 49 శాతం ఉత్తీర్ణత

ముప్పాళ్ళ: మండలంలో పదవతరగతి పరీక్షా ఫలితాల్లో 49% ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈఓ ఒంగోలురాజు శనివారం తెలిపారు. మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాలకు చెందిన మొత్తం 394 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 194 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. మాదల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జీడిమళ్ళవీరేంద్ర అత్యధికంగా మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో ఉండగా, ముప్పాళ్ళ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పీ.అమూల్యగ్రేస్ ఉత్తమ మార్కులు సాధించి రెండవస్థానంలో నిలిచింది. నార్నెపాడు జెడ్పీ పాఠశాలకు చెందిన కల్లూరి జానకిరామ్ ఉత్తమ మార్కులు సాధించి మూడవస్థానంలో నిలిచారు. మాదల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొత్తం 154 మంది పరీక్షలకు హాజరుకాగా వారిలో 65 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బొల్లవరం జెడ్పీ పాఠశాలలో 13 మందికి గాను 9 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. దమ్మాలపాడు జెడ్పీ పాఠశాలలో 56 మందికి 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ముప్పాళ్ళ జెడ్పీ పాఠశాలలో 76 మందికి 43 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ పాఠశాల, గోళ్ళపాడు 36 మందికి గాను 14 మంది విద్యార్థులుఉత్తీర్ణత సాధించారు. నార్నెపాడు జెడ్పీ పాఠశాల లో 59 మందికి గాను 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

అచ్చంపేట 64 శాతం ఉత్తీర్ణత

అచ్చంపేట: 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అచ్చంపేట మండలం నుంచి 64 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ వి.రాజశేఖర్ తెలిపారు. మొత్తం 548 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకా 349 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. అచ్చంపేట జెడ్పీహెచ్ స్కూలులో 195 మంది విద్యార్థులు హాజరుకాగా 99 మంది ఉత్తీర్ణతతో 51శాతం, మాదిపాడు జెడ్పీహైస్కూలులో 79 శాతం, కొండూరు జెడ్పీహెచ్ స్కూలులో 65 శాతం, పెదపాలెం జెడ్పీహెచ్ స్కూలులో 30 శాతం, వేల్పూరు జెడ్పీ హైస్కూలులో 73 శాతం, కోనూరు జెడ్పీహైస్కూలలో 71 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనారు. ఏపి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 49.2శాతం, కస్తూర్బా బాలికల పాఠశాలలో 65 శాతం ఉత్తీర్ణులైనారు. ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యాన్ హైస్కూలులో 96 శాతం, బ్లూబెల్స్ పబ్లిక్ స్కూలులో 97 శాతం విద్యార్థులు పాసైనారు. మొత్తంమీద ఇంగ్లిషు మీడియం నుంచి 73 శాతం, తెలుగు మీడియం నుంచి 50 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనారు. ప్రభుత్వ పాఠశాలల్లో వేల్పూరు జెడ్పీహెచ్ స్కూలుకు చెందిన పాటిబండ్ల సాయివినీల ఉత్తమ మార్కులులో ప్రథమస్థానం, అచ్చంపేట జెడ్పీహైస్కూకు చెందిన గుత్తికొండ సాయినాగసింధు ఉత్తమ మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. అన్నిపాఠశాలల్లో మండల ఫస్ట్ విద్యాన్‌పబ్లిక్ స్కూలుకు చెందిన గంజినబోయిన దుర్గసిరికార్తిక ఉత్తమ మార్కులు, మండల సెకండ్ బ్లూబెల్స్ పాఠశాలకు చెందిన గుండా వెంకటశివనాగ రూపశ్రీ ఉత్తమ మార్కులు సాధించారు. మంచి మార్కులు కనబరచిన విద్యార్థులను ఎంఈఓ వి.రాజశేఖర్, పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

మండలంలో 67 శాతం ఉత్తీర్ణత

నకరికల్లు : మండలంలోని ఉన్నతపాఠశాలల్లో పదో తరగతిలో 565 మంది విద్యార్థులు పరీక్షలు రాసి 381 మంది ఉత్తీర్ణులై 67 ఉత్తీర్ణతా శాతం సాధించారు. గుండ్లపల్లి ఉన్నతపాఠశాలలో 82 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 51మంది ఉత్తీర్ణులయ్యారు. నకరికల్లు ఉన్నతపాఠశాలలో 78 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 49 మంది ఉత్తీర్ణులయ్యారు. నకరికల్లులోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో 33 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 17మంది ఉత్తీర్ణులయ్యారు. చల్లగుండ్ల ఉన్నతపాఠశాలలో 17మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 11మంది ఉత్తీర్ణులయ్యారు. ఉన్నతపాఠశాలలో 82 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 51 మంది ఉత్తీర్ణులయ్యారు. చల్లగుండ్లలోని రాజీవ్‌గాంధీ వికలాంగుల ఉన్నతపాఠశాలలో ఆరుగురు విద్యార్థులు పరీక్షలు రాయగా ముగ్గురు ఉత్తీర్ణులయ్యారు. కండ్లకుంటలోని ఉన్నతపాఠశాలలో 92మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 69 మంది ఉత్తీర్ణులయ్యారు. దేచవరంలోని ఆదర్శ పాఠశాలలో 81మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 59 మంది ఉత్తీర్ణులయ్యారు. కుంకలగుంటలోని ఉన్నతపాఠశాలలో 66 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 45 మంది ఉత్తీర్ణులయ్యారు. చేజర్ల ఉన్నత పాఠశాలలో 25 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 13మంది ఉత్తీర్ణులయ్యారు. చల్లగుండ్లలోని శ్రీవిశ్వశాంతి స్కూల్‌లో 81మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 62 మంది ఉత్తీర్ణులయ్యారు.

అమరావతిలో...

అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా శనివారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని అత్యధికంగా మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ పాఠశాలలో అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు అత్యధిక ప్రతిభ కనబరిచి 106 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 92 మంది, మండెపూడి జెడ్పీ హైస్కూల్‌లో 48 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 27 మంది, మల్లాది జెడ్పీ హైస్కూల్‌లో 20 మందికి 12 మంది, లింగాపురం జెడ్పీ హైస్కూల్‌లో 17 మందికి 10 మంది, శ్రీరామకృష్ణహిందూ హైస్కూల్(ఎయిడెడ్)లో 57 మందికి 39 మంది, అత్తలూరు ఆర్‌సీఎం హైస్కూల్లో 17 మందికి 9మంది ఉత్తీర్ణులైనారు. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 317 మంది పరీక్ష రాయగా 206 మంది ఉత్తీర్ణులై 65 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో అత్యల్పంగా మునగోడు జెడ్పీ హైస్కూల్లో 56 మందికి 17మంది పాసై కేవలం 30 శాతం ఉత్తీర్ణత సాధించింది.

రాజుపాలెంలో 63 శాతం ఉత్తీర్ణత

రాజుపాలెం: మండలంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 63 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ మల్లిఖార్జునశర్మ శనివారం తెలిపారు. నెమలిపురి జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థి బి.రోణిక మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థి ఏ.రాజేష్ మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి చొక్కా రేణుక ప్రథమం, సముద్రాల ప్రగతి ద్వితీయ స్థానంలో నిలిచింది. అనుపాలెం జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థి కొమెర పూజిత ప్రథమం, సుంకర త్రిపురసుందరి ద్వితీయ స్థానం సాధించింది. కోటనెమలపురి పాఠశాలకు చెందిన విద్యార్థి గుంటక అక్షయ ప్రథమ స్థానం, కుంపటి పెదసుశీల ద్వితీయ స్థానంలో నిలిచారు. గణపవరం జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్‌కె ఆయేషసిద్దుకి ప్రథమ స్థానం, కె.నాగసంజన ద్వితీయ స్థానం, ఇనిమెట్ల జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థి గడ్డిపర్తి శరణ్ ప్రథమం, గొబ్బూరి ప్రవల్లిక ద్వితీయ స్థానం సాధించింది. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థి వి.గాయత్రి ప్రథమ స్థానం, చింతగుంట్ల విజయకుమారి, వింపి దివ్యశ్రీలు ద్వితీయ స్థానం సాదించారు. నవోదయ ఇంగ్లిషు మీడియం పాఠవాలకు చెందిన విద్యార్థి సింగడి ధనుష్ ప్రథమ స్థానం, ధరణికోట మల్లిఖార్జున ద్వితీయ స్థానం సాధించారు.

సత్తెనపల్లి డివిజన్‌లో 66.75 శాతం ఉత్తీర్ణత

సత్తెనపల్లి: డివిజన్‌లోని 14 మండలాల్లో పదో తరగతి పరీక్షలు 10,605 మంది విద్యార్థులు రాయగా 7,083 మంది ఉత్తీర్ణులయ్యారు. 66.75 వాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రథమ శ్రేణిలో 5,259 మంది, ద్వితీయ శ్రేణిలో 1,236 మంది తృతీయశ్రేణిలో 588 మంది ఉత్తీర్ణులయ్యారు. 3,522 మంది ఫెయిల్ అయ్యారు. కాగా సత్తెనపల్లి డివిజన్ నుంచి సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గుత్తికొండ శివమాధవరెడ్డి జిల్లా ప్రథమ స్థానం, మాజవరం మండలం మోర్జంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గొరిగే నవ్యశ్రీ జిల్లాలోనే ద్వితీయ స్థానం, మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ జాస్మిన్ జిల్లాలోనే తృతీయ స్థానం సాధించినట్లు ఉప విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

అకాలవర్షాలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

కమిషనరేట్ అదనపు ఉద్యానసంచాలకుడు బాలాజీ నాయక్



కల్లాల్లోని మిరప కాయలను పరిశీలిస్తున్న బాలాజీ నాయక్

సత్తెనపల్లి: అకాల వర్షాలకు మిరప పంటలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనరేట్ అదనపు ఉద్యాన సంచాలకుడు బాలాజీ నాయక్ చెప్పారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరు, పెదకూరపాడు మండలం కాశిపాడు గ్రామంలో శనివారం క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం మిరప పంట కోత రెండవ, మూడవ కోత, కల్లాలలో ఎండుతున్న దశలో ఉందన్నారు. కల్లాలో ఉన్న కాయలు తడవకుండా తార్పాలిన్ పట్టలతో కప్పి జాగ్రత్త చేసుకోవాలన్నారు. అధిక తేమ వల్ల పంట మీద ఉన్న కాయలకు కాయ కుళ్ళు రావడానికి అవకాశం ఉందని సస్యరక్షణ చర్యలను చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా మిరప పంటను ఎలా సంరక్షించుకోవాలో వివరించారు. ఈ వారంలో కురిసిన వర్షాల కు, గాలులకు ఉద్యాన పంటలైన మిరప, బొప్పాయి, కూరగాయలకు నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో క్షేత్రస్థాయిలో సందర్శించి రైతులకు తగు సూచనలు చేశారు. ఆయనతోపాటు జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.జె.బెన్ని, సత్తెనపల్లి ఉద్యాన శాఖ అధికారిని సిహెచ్ జనని, శ్రీ నిత్య, తదితరులు ఉన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో శ్రీఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామసర్పంచ్ మోర్తల వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో శ్రీఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఈనెల 7వ తేదీ ఉదయం జరగనుంది. కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ట అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు.

తడిసిన ధాన్యంను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది

పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



తడిసిన వరి ఓదెలను పరిశీలిస్తున్న జేసీ జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళి

రుద్రవరం(ముప్పాళ్ళ): ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన ధాన్యంను ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తోందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. మండలంలోని రుద్రవరం గ్రామంలోని వర్షాలకు తడిచిన పొలాలను శనివారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఐ.మురళితో కలిసి పరిశీలించారు. మండల పరిధిలోని ఇరుకుపాలెం గ్రామంలో జీడీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వర్షానికి దెబ్బతిన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవచ్చని, లోడింగ్ చార్జీలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. అవసరమైన గన్ని బ్యాగ్స్ కూడా రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు ధాన్యాన్ని తీసుకువెళ్ళాలన్నారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు....

అలాగే అన్ని గ్రామాల్లోను రైతుల వద్ద ఉన్నటువంటి మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లోని సిబ్బంది ద్వారా అమ్ముకోవచ్చన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తేమశాతం, నాణ్యతా ప్రమాణాలు ఉండాలన్నారు. క్వింటా రూ.1962 చొప్పున కొనుగోలు చేస్తారని చెప్పారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, గ్రామసర్పంచ్ రాప్రోలువెంకటకృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ, పౌరసరఫరాలసంస్థ అధికారి వరలక్ష్మీ, జీడీసీఎంఎస్ సిబ్బంది పిచ్చయ్య సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వెంకటేశ్వర స్వామి గ్రామోత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లోని అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ దైవం శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికి విశేషంగా వైశాఖ మాసం, వైశాఖ బుద్ధ పూర్ణిమ పురస్కరించుకుని శ్రీవారికి స్నపన తిరుమంజనం శనివారం శోభాయమానంగా జరిగింది. శ్రీమాన్ శ్రీ శ్యాము ఆచార్య రామానుజ దాసన్ గరుడల్వార్ మండపంలో వేంచేసి ఉన్న గరుడల్వార్ మూర్తికి, శ్రీమహాలక్ష్మి అమ్మవారికి మల్లెల్లతో విశేష పూజ, పుష్పభిషేకం నిర్వహించారు, అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారికి అత్యంత ఇష్టమైన గరుడ వాహనంపై సత్తెనపల్లి రైల్వేస్టేషన్ పుర విధులలో దర్శనమిస్తూ భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఎర్రబాలెం(క్రోసూరు): ప్రజలతోనే ఉంటా, ప్రజల్లోనే ఉంటాను, తనను ప్రజలు ఎప్పుడైన కలుసుకోవచ్చునని, తాను అందరికీ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే నంబూరుశంకరరావు అన్నారు. శనివారం మండలంలోని ఎర్రబాలెం(క్రోసూరు సచివాలయం-3) లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగిస్తూ స్థానికులతో మాట్లాడారు. జగనన్న ఆశిస్సులతో మీ అందరీ సహకారంతో తనను అన్ని గ్రామాల్లో ప్రజలు బాగా ఆదరిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి అక్కడి మహిళలు, ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలున్నాయా అని అడిగారు. సమస్యలు పరిష్కరించేందుకు అక్కడిక్కడే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేయడం జరిగిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. దేవుడి దయ, ప్రజల అండతో మంచి చేసామని, ఇక ముందు కూడా ఇంకా మంచి చేస్తామని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశ్వీరదించాలని ఎమ్మెల్యే కోరారు. ముందుగా గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వెలది అప్పారావు, గల్లాగురుపాదం, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, నీరుకొండ చలపతిరావు, గుమ్మడి ఏసుబాబు, నల్లగొండ వెంకయ్య, కందిమళ్ల హనుమంతరావు, గుంజా హనుమంతరావు, వెలది అమరయ్య, క్రోసూరు నుంచి షేక్ మస్తాన్, షేక్ గఫార్ ,గార్లపాటిదాసు, షేక్ ఖాదర్, అనుముల కోటిరెడ్డి, పాశంశ్రీనివాసరెడ్డి, అచ్చంపేట నుంచి యార్డు మాజీ డైరెక్టర్ అంబటినారాయణ, సొసైటీ అధ్యక్షుడు ఆర్. రంగయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు తుమ్మా చిన్నప్పరెడ్డి, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల గురించి వివరించండి

ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య



మాట్లాడుతున్న ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య

పెదకూరపాడు: ప్రతి ప్రజాప్రతినిధి, అధికారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల పరిషత్ అధ్యక్షుడు బెల్లంకొండ మీరయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మీరయ్య శాఖ వారీగా సమీక్ష నిర్వహించారు. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో జరుగుతున్న పనులను సమీక్షించారు. జగనన్న కాలనీల్లోని గృహాలను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో అవసరమైన స్థలంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, వర్గ భేదాలు లేకుండ అందరికి సంక్షేమ సాయం అందిస్తున్నారని, ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిన తెలియజేయాలన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో మండలంలోని పాటిబండ్ల- పెదకూరపాడు, పెదకూరపాడు- శిరిపురం రోడ్డు, లగడపాడు- కన్నెగండ్ల రోడ్డు, హుస్సేన్‌నగరం- పెదకూరపాడు రోడ్డు, గారపాడు- హుస్సేన్‌నగరం రోడ్డులను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. పెదకూరపాడు నూతనంగా నిర్మిస్తున్న సీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్ భాష, బాలమేరి, ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దార్ క్షమారాణి పాల్గొన్నారు.

పంటనష్టం వాటిల్లిన రైతుల వివరాల నమోదు



పొలాలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు, ఎన్యుమరేషన్ బృందం

నకరికల్లు: అకాలవర్షానికి నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని దేచవరం, చల్లగుండ్ల గ్రామాల్లో పంటనష్టపోయిన రైతుల వివరాలు సేకరించేందుకు ఎన్యుమరేషన్ బృందాలు శనివారం పర్యటించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 33 శాతం కన్నా ఎక్కువ పంట నష్టం వాటిల్లిన పొలాలను పరిశీలించి రైతుల వివరాలు సేకరిస్తున్నామని అన్నారు. మొక్కజొన్న పంటను రైతుభరోసాకేంద్రాల్లో అమ్మదలుచుకున్న రైతులు పేర్లునమోదు చేసుకోవాలని అన్నారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులు వద్ద మొక్కజొన్న కొనుగోలు చేస్తామన్నారు. వరిధాన్యం అమ్మదలచిన రైతులు రైతుభరోసాకేంద్రాల్లో సంప్రదిస్తే వెంటనే కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికలు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 3గంటలకు అండర్ 15 జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం శనివారం తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు వయస్సు ధృవీకరణతోపాటు ఆధార్ కార్డు ఒరిజనల్స్‌తో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు : 8309426350 ఫోనుచేసి సంప్రదించవలసినదిగా ఆయన కోరారు.

రైతులకు అవగాహన సదస్సులు

క్రోసూరు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు రాబోయో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా అమలయ్యే వివిధ పథకాలపై ఈనెల 8 వ తేదీ నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ వేణుగోపాల్ శనివారం తెలిపారు.ఈ కార్యక్రమంలో విత్తనాలు కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కౌలు రైతులకు కౌలు కార్డుల జారీ, భూసారపరీక్షలు ,పచ్చిరొట్టపైర్ల పెంపకం, వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్, వైఎస్సార్ యంత్రసేవాపథకం, ఈ -పంట నమోదు, డాక్టర్ వైఎస్సార్ ఉచితపంటల భీమాపథకం, పొలంబడి, ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల సరఫరా, చిరుధాన్యాల సాగు మొదలగు విషయాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాశాఖ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొని వారివారి శాఖలకు సంబంధించిన వివరాలను తెలిచేస్తారన్నారు. ఎనిమిద వ తేదీన దొడ్లేరు-1,2 రైతుభరోసాకేంద్రాల వద్ద ఉదయం 10 గంట నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం నుండి మండలంలోని అందుకూరు గ్రామంలో రైతుభరోసాకేంద్రం వద్ద అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదేవిధంగా తొమ్మిద వ తేదీన ఉదయం నాగవరం,మధ్యాహ్నం విప్పర్ల, 10 వతేదీ ఆవులవారిపాలెం, క్రోసూరు-3, 11 వ తేదీ హసనాబాద్ , అనంతవరం, 12 వ తేదీ క్రోసూరు-1, 88త్యాళ్లూరు, 15 వతేదీ క్రోసూరు-2, పీసపాడు,16 వ తేదీ బయ్యవరం, గుడిపాడు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలుంటాయన్నారు. కావున రైతులు ఈ అవగాహన కార్యక్రమానికి హాజరై తమకు కావాల్సిన సమాచారం తెలుసుకోగలరని ఏఓ తెలిపారు.

బాలుడి కుటుంబానికి రూ.3లక్షల సాయం

నరసరావుపేట: పట్టణంలోని రెడ్డినగర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంటులో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన షేక్ నసీం కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేశారు. 34వ వార్డులోని బీసీ కాలనీలో నసీం స్వగృహానికి వెళ్లి భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ ఆదం, షేక్ బాజీ, కాకుమాను సదాశివరెడ్డి పాల్గొన్నారు.

